తెలుగు దిన పత్రిక

http://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | బుధవారం | 04-02-2026 | సంపుటి-03 | సంచిక-239 | పేజీలు - 08 | వెల:3/–


## అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్



**అక్షరగళం, కరీంనగర్,ఫిబ్రవరి 3:** మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు కష్టపడి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.'నేను కేసీఆర్‌ని గజగజ వణికించా. నా తలకాయను కేసీఆర్.. ఆరు ముక్కలు చేస్తానని గతంలో అన్నారు. ఆయన సంగతి తేల్చేందుకు ఫామ్‌హౌస్‌కు వస్తానని చెప్పా. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను బజార్‌కు లాక్కొచ్చా. కేసీఆర్ మెడలు వంచింది నేనే. నేను ఎవరికీ భయపడను. గడీల నుంచి కేసీఆర్‌ను నేనే బయటకు తీసుకువచ్చా' అని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

### వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ



ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

**అక్షరగళం, న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు.

మిగతా 2లో



# మన సహనమే విజయానికి బాట

### విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

**అక్షరగళం, న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను

మిగతా 2లో




## గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 3:** తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను

మిగతా 2లో



## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్షరగళం, కరీంనగర్,ఫిబ్రవరి 3:** గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన

మిగతా 2లో



## బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

02

## యూరియా యాప్ పై రైతులు సంతృప్తి వ్యక్తం

రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి

తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి



**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 3:** రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత

మిగతా 2లో



## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

ఉచితాలను ప్రకటించడానికి కాదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 3:** ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్`2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం

మిగతా 2లో

## కడుపులో కత్తులు, నోటిలో విషం

రేవంత్ రెడ్డి విమర్శలపై మండిపడ్డ హరీష్ రావు



**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 3:** కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మాజీ మంత్రి, బీఆరఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి

మిగతా 2లో

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

ఎక్స్ వేదిగా కెటిఆర్ విమర్శలు



**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి 3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన

మిగతా 4లో



## మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

ప్రతిపైసనూ లెక్కించనున్న అధికారులు

**అక్షరగళం, నిజామాబాద్,ఫిబ్రవరి 3:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని

మిగతా 2లో

## జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట

కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి



**అక్షరగళం, జగిత్యాల,ఫిబ్రవరి 3:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనున్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట

మిగతా 2లో



## కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు

కల్తీ సంగతి తెలిసీ మౌన్గా వైకాపా పాలకులు

సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు

కేబినేట్ వివరాలను వెల్లడించిన మంత్రులు

02

**అక్షరగళం, అమరావతి,ఫిబ్రవరి 3:** కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన



## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

(మొదటిపేజీ తరువాత)

చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆరఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.



## మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

(మొదటిపేజీ తరువాత)

ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వ హిస్తున్నారా? ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీఖర్చులో చూపించారా?, సోష ల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ఫ్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడంతో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితిపై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక చూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

## మన సహనమే విజయానికి బాట


(మొదటిపేజీ తరువాత)



కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

## యూరియా యాప్ పై రైతులు సంతృప్తి వ్యక్తం

(మొదటిపేజీ తరువాత)



అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎసఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు




ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. సీఎఫ్‌టీఆరఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలని అన్నారు. కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే అన్నారు. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆరఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాల సేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్క పాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. హిందూధర్మం మూలాలను దెబ్బతీసే విధంగా వైకాపా చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు.

## బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ



**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 `27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమీషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

(మొదటిపేజీ తరువాత)




ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

## కడుపులో కత్తులు, నోటిలో విషం



(మొదటిపేజీ తరువాత)

హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. విద్వేష రాజకీయాలకు, నరంలేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు.ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అని ఘాటు విమర్శలు చేశారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అన్నారు. లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి..? నువ్వు అమెరికాలోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టమైందని హరీష్‌రావు ఎద్దేవా చేశారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


(మొదటిపేజీ తరువాత)



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆరఎస్ బిజెపిల వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

## జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

(మొదటిపేజీ తరువాత)



ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆరఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

(మొదటిపేజీ తరువాత)



2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారత దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## వరంగల్ జూలో తెల్లపులి మృతి

**వరంగల్,ఫిబ్రవరి 3:** నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యంగా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.




# పీఎస్‌యూల పునరుజ్జీవనానికి కొత్త స్ఫూర్తి

దేశంలో అతిపెద్ద కోకింగ్ కోల్ ఉత్పత్తిదారు, కోలిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఈ సంవత్సరం జనవరి 19న ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఈ సంస్థ ఐపీఓ చరిత్ర సృష్టించింది. రూ.1,070 కోట్లను సేకరించడానికి ఆఫర్‌లో ఉన్న 46 కోట్ల షేర్ల కోసం 147 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. 90 లక్షలకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. భారత ప్రభుత్వరంగ సంస్థల విజయవంతమైన ఐపీఓ లిస్టింగ్ ఇదొక్కటే కాదు. ఈ ఒరవడి గత కొన్నేళ్లుగా ఇలాగే స్థిరంగా కొనసాగుతోంది. గత 7–8 సంవత్సరాల కాలంలో దాదాపు 15 ప్రభుత్వరంగ సంస్థలు భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అవడంతోపాటు అవసరమైన మూలధనాన్ని సేకరించగలిగాయి. వాటాదారుల షేర్ల విలువను పెంచడంతో పాటు రిటైలర్ల సంపదను కూడా సృష్టించగలిగాయి. 2017 నుంచి, భారతదేశంలో ఇంజనీరింగ్, నిర్మాణం, రైల్వే, రక్షణ, ఇంధన సంబంధిత రంగాలలో 10కి పైగా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. తద్వారా, దిగువ పేర్కొన్న కంపెనీలలో, మూలధన మార్కెట్ విలువ రూ. 1.40 లక్షల కోట్ల నుంచి రూ. 8.53 లక్షల కోట్లకు పెరిగింది– ఇది 513 శాతం భారీ పెరుగుదల. ఆగస్టు, 2017లో రూ.7,096 కోట్లతో లిస్టింగ్ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి రూ.42,634 కోట్లకు (501 శాతం) పెరిగింది. అక్టోబర్, 2020లో రూ.3,489 కోట్లతో లిస్టింగ్ అయిన మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి ఏకంగా రూ.1,00,000 కోట్లకు (అంటే 2,766శాతం!) పెరిగింది. అదేవిధంగా, జూలై, 2018లో రూ.4,254 కోట్లతో లిస్టింగ్ అయిన RITES లిమిటెడ్ మార్కెట్ మూలధనం రూ. 11,652 కోట్లకు (174శాతం) పెరిగింది. IRCON ఇంటర్నేషనల్ సెప్టెంబర్, 2018లో రూ.3,919 కోట్ల నుంచి రూ.16,704 కోట్ల (326 శాతం)కు పెరిగింది. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఏప్రిల్, 2019లో రూ.3,972 కోట్ల నుంచి రూ.74,508 కోట్లకు (1,776శాతం) పెరిగింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ జనవరి, 2021లో రూ.32,475 కోట్ల నుంచి రూ.1,63,000 కోట్లకు (402శాతం) పెరిగింది. అంతేగాక, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ & టూరిజం కార్పొరేషన్– అక్టోబర్, 2019లో రూ.11,658 కోట్ల నుంచి రూ.54,764 కోట్లకు (370శాతం), రైల్ టెల్ కార్పొరేషన్ (ఫిబ్రవరి, 2021) రూ.3,896 కోట్ల నుంచి రూ.11,924 కోట్లకు (206శాతం), హౌసింగ్ & అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (మే, 2017) రూ.14,514 కోట్ల నుంచి రూ.45,683 కోట్లకు (215 శాతం), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (మార్చి, 2018) రూ.37,731 కోట్ల నుంచి రూ.2,93,000 కోట్లకు (676శాతం), ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (నవంబర్, 2023) రూ.16,124 కోట్ల నుంచి రూ.39,301 కోట్లకు (144శాతం) పెరిగింది. ఈ పీఎస్‌యూలు అన్నీ మొత్తంగా తమ మూలధన మార్కెట్ విలువను రూ.1,39,128 కోట్ల నుంచి రూ. 8,53,170 కోట్లకు (అంటే దాదాపు 513 శాతానికి) పెంచుకున్నాయి. భారీ పెరుగుదల ఇది. గతంలో, ప్రభుత్వరంగ సంస్థలు మూలధన పెట్టుబడులు, ఇతర విస్తరణ పనుల కోసం సంబంధిత మంత్రిత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడాల్సి వచ్చేది. దీనికోసం ఆయా మంత్రిత్వ శాఖల్లో వివిధ విభాగాలతో విస్తృతమైన చర్చలు జరపాల్సి రావడమే కాకుండా నిధులను విడుదల చేయించుకోవడానికి చాలా సమయం పట్టేది. నేడు నిర్ణయాలు అమలు చేయడంలో ఎంతో వేగాన్ని ప్రదర్శిస్తున్న ఈ సంస్థలు నిధుల కోసం ఎదురుచూసే స్థితి నుంచి.. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నిధులు సమకూర్చే స్థాయికి ఎదిగాయి. గత పరిస్థితులతో పోలిస్తే ఇది రివర్స్ ట్రెండ్. ఉదాహరణకు, క్రిటికల్ మినరల్స్ రంగంలో భారతదేశ దీర్ఘకాల అవసరాల దృష్ట్యా స్థిరమైన సప్లయ్ చైన్‌ను బలోపేతం చేసేందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ జనవరి 2025లో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించింది. దీని కోసం రూ.34,300 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అందులో రూ. 1,500 కోట్లు మాత్రమే బడ్జెట్ నుంచి లభిస్తున్నాయి. వివిధ మంత్రిత్వ శాఖల విభాగాల సంపూర్ణ సమన్వయం (Whole of Government Approach) విధానంతో కేంద్ర ప్రభుత్వం సమకూర్చే ఇతర పెద్ద మొత్తాన్ని అటుంచితే, 50శాతానికి పైగా నిధులు అంటే.. రూ.18,000 కోట్లు వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు సమకూరుస్తున్నాయి. వీటిలో గనుల మంత్రిత్వ శాఖ నుంచి KABIL, బొగ్గు శాఖ నుంచి కోలిండియా లిమిటెడ్, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్, ఉక్కు శాఖ నుంచి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ నుంచి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, పెట్రోలియం శాఖ నుంచి ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ వంటివి ఉన్నాయి. రానున్న రోజుల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, సంబంధిత సాంకేతికతను మెరుగుపరిచేందుకు ఈ సంస్థల నుంచి సేకరించే పెట్టుబడులను ఉపయోగిస్తారు. ఎన్‌సీఎంఎమ్ కోసం పీఎస్‌యూల నుంచి పెట్టుబడులను తీసుకొచ్చిన ఈ వ్యూహాత్మక విధానం రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ కీలకమైన కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమకూర్చేలా.. కేంద్ర ప్రభుత్వానికి ఒక మంచి అవకాశం అందించింది.

చాలా వరకు మార్కెట్లు స్థిరమైన పెట్టుబడులు కొనసాగించిన వాటాదారులకు మాత్రమే మంచి లాభాలను అందిస్తాయి. బీసీసీఎల్ విషయానికి వస్తే.. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూగా ముద్రపడటం నుంచి మొదలుపెట్టి.. వ్యాల్యూ– డ్రివెన్ వ్యవస్థగా, వ్యూహాత్మకంగా కీలకమైన సంస్థగా మారడం వరకు అది సాగించిన ప్రయాణం మనందరికీ తెలుసు. ఇవాళ ఈ సంస్థకు భారతదేశ డొమెస్టిక్ కోకింగ్ కోల్ ఉత్పత్తిలో 58.5శాతం వాటా ఉంది. దీంతో కీలకమైన ఉక్కు, మౌలిక సదుపాయాల రంగంలో ఇది అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది. ఈ ముఖ్యమైన విషయాన్ని పెట్టుబడిదారులు గుర్తుపెట్టుకున్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, తయారీరంగ అభివృద్ధి ఆత్మనిర్భరతపై దృష్టి సారించిన ఆర్థిక వ్యవస్థలో, బీసీసీఎల్ ఒక బొగ్గు ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా ఇంధన భద్రతలో పారిశ్రామిక పురోగతికి కీలకమైన ఇరుసుగా తన సేవలను కొనసాగిస్తోంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సంస్థ సాధించిన విజయం అనుకోకుండా వచ్చినది కాదు. ప్రభుత్వరంగ సంస్థలు తమ ఆస్తులను ఎలా పొందుతున్నాయి, వాటిని ఎలా వృద్ధి చేసుకుంటున్నాయనే విషయంలో.. చోటుచేసుకుంటున్న విస్తృత మార్పుకు వివిధ సంస్థలు అనుసరిస్తున్న తీరే నిదర్శనం. ఇటీవలి కాలంలో పెట్టుబడిదారులు దీర్ఘకాలిక లాభాల గురించి వివేకంతో ఆలోచిస్తున్నారు. స్పష్టమైన లక్ష్యాలతో, కార్యాచరణతో ముందుకు వస్తున్న ఈ సంస్థల సామర్థ్యాన్ని, వాటి పురోగతికి ఉన్న అవకాశాలు, అంశాలను విశ్లేషిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. అలాంటి సామర్థ్యమున్న పీఎస్‌యూలకు రెండో ఆలోచనకు తావులేకుండా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నారు. తమ మంత్రిత్వ శాఖల నుంచి పొందిన స్వయం ప్రతిపత్తిని పీఎస్‌యూలు పరిపాలనా నాణ్యత, వ్యూహాత్మక ప్రణాళిక, అమలులో వేగాన్ని తీసుకురావడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకున్నాయి. ఈ మార్పు మరిన్ని సంస్థలకు సరికొత్త విశ్వాసాన్ని అందిస్తోంది. మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంచుకోవడం ద్వారా తమ సత్తా చాటేందుకు ప్రభుత్వరంగ సంస్థలు ఐపీఓలతో సిద్ధమవుతున్నాయి. ఐపీఓలు పెట్టుబడులకు మంచివి కావు అనే పాతకాలపు ఆలోచనలను వెనక్కునెట్టి, ఒక కొత్త వాస్తవికతవైపు ప్రభుత్వరంగ సంస్థలు అడుగులు వేస్తున్నాయి.

# అణచివేత ఎల్లకాలం సాగదు

రెండా? కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామన్ జనవరి 29న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 202526 ఒక్కటేనా? రకరకాల నివేదికలు డజన్ల కొద్దీ ఉన్నాయి. కేసీఆర్ నాయకత్వాన బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో తెలియజెప్తూ.. అవేవీ ఆయన ప్రభుత్వం ప్రకటించినవి కావు. కనుక కళ్లుండి అవి చూడగలిగిన వారికి అది చాలు, వాస్తవాలేమిటో తెలిసేందుకు. కానీ కళ్లుండీ చూడలేని కబోది మేధావులకు మరొక వెయ్యి నివేదికలైనా చాలవు కండ్లు తెరుచుకునేందుకు.

కేసీఆర్ అంటే రాజకీయంగా ఎంతమాత్రం సరిపడని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మంత్రులు వివిధాంశాలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు, ఆర్థిక సర్వేలు, బడ్జెట్ పత్రాలు, వారు గతంలో నడిపిన ప్లానింగ్ కమిషన్, ప్రస్తుతం నిర్వహిస్తున్న నీతి ఆయోగ్‌ల నివేదికలు, రిజర్వ్ బ్యాంకు నివేదికలు, కాగ్ నివేదికలు, అనేక అంతర్జాతీయ అధ్యయనాలు, విశ్వవిద్యాలయాల పరిశోధనలు, చివరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం మింగలేక కక్కలేక తప్పనిసరై పేర్కొన్న గణాంకాలు. ఇలా ఒకటా రెండా? బీఆర్ఎస్ ఇంకా పాలిస్తుండినప్పుడు, తర్వాత ఈ రెండేండ్లలో కూడా.

అయితేనేమిగాక. దివాంధ మేధావులకు కనిపించవు, చెవులు వినిపించవు. మేధావులకు స్వీయ అధ్యయనాలతో ఏర్పడే అంతర్ దృష్టి కూడా ఉంటుందంటారు. కానీ తెలంగాణలో మేధావులుగా చెలామణి అయ్యే కొందరికి అది అయినా లేదు. పోనీ సొంత అధ్యయనాలు జరిపి పైన పేర్కొన్న నివేదికలు తప్పని నిరూపించరు. కారణం వారికి స్వప్రయోజనాలు, ఆ కారణంగా కలిగే సంకుచిత దృష్టి, వాటినే సమాజ ప్రయోజనాలుగా చూపగల చాతుర్యాలు మాత్రమే ఉంటాయి. దానితో దురుద్దేశాలు ఏర్పడుతాయి. ప్రజల వద్దకు వెళ్లరు. ఆ విషయాలపై వారి అనుభవాలు, ఆలోచనలు ఏమిటో తెలుసుకోరు. వాస్తవాలు తెలుస్తాయేమోనన్నది వారి భయం. కనుక వక్రీకరణలే శర్యణమవుతాయి.

ఎంత దూరమో ఎందుకు. ఈ సోకాల్డ్ మేధావులలో పెద్ద సంఖ్య హైదరాబాద్‌లోనే ఉంటారు. ప్రభుత్వం మూసీ పథకం పేరిట వందలాది మంది పేదల చిన్న చిన్న ఇండ్లు, రేకుల షెడ్లను అరాచకంగా కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి కూలగొడుతూ, వారిని ఇంకా ఉడుకుతున్న అన్నపు గిన్నెలు సహా బజార్ల పాలు చేస్తూ... చిన్న పిల్లలను స్కూలు పుస్తకాలైనా తీసుకోకుండా తరిమివేస్తూ... బాధితులలో ఒక వృద్ధురాలు ఆత్మహత్య సైతం చేసుకోగా, ఆ పేదలంతా ప్రస్తుత ప్రభుత్వాన్ని మనమెన్నడూ వినని రీతిలో ఆగ్రహంగా శాపనార్థాలు పెట్టి ప్రశ్నిస్తున్న రోజుల్లో ఈ మేడిపండు మేధావుల్లో ఒక్కరంటే ఒక్కరైనా, ఒక్కటంటే ఒక్కసారానై అటు తొంగిచూశారా? ఒక ప్రకటన చేశారా? ఇందిరా పార్కు వద్ద ఒక్కరైనా ధర్నాకు కూర్చున్నారా? వారిదృష్టిలో అవి పేదల హక్కులు కావు, పౌరహక్కులు కావు. పేదరైతుల ఇండ్లపై అర్ధరాత్రి దాడులు జరిపి, మహిళలను సైతం అవమానించి, వారి భూములను ఎవరో పెట్టుబడిదారుల కంపెనీల కోసం బలవంతంగా ఆక్రమించజూసిన లగచర్ల వంటి ఉదంతాలు అనేకం ఉన్నాయి. అదే ఇంకా కొనసాగుతున్నది. భూములు తీసుకు తీరుతామని మంత్రులు బాహాటంగా ప్రకటిస్తున్నారు. మన మేధావి బృహస్పతులు కొందరు ఆ జిల్లాలవారే. అయినా వారు కండ్లు తెరుచుకోనిది ఎందువల్ల? జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్న చెక్‌డ్యాములను ఇసుకకోసం కొందరు ప్రభుత్వ నేతల అండదండలతో పేల్చివేస్తూ, రైతులు గగ్గోలు పెడుతుండగా, ఈ మేధావి వేషధారులకు అటు వెళ్లి చూద్దామనే ఆలోచన రానిది ఎందువల్ల?



ఈ అపర మేధావుల్లో అనేకులు విద్యారంగంలో పనిచేసినవారు, ఇంకా చేస్తున్నవారు. రిటైరయినా లక్షల రూపాయల ప్రాజెక్టులు సంపాదించుతూ, లక్షల రూపాయల పెన్షన్లు వెనుకేసుకుంటున్నవారే. వారికి ఇవేవీ సమస్యలు కావు. కానీ, విద్యారంగ దుస్థితికి ఎంతగానో ఆందోళన చెందుతున్నట్లు నటనలు చేసే వీరు, వరుసగా గురుకుల విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు నాసిరకం ఆహారంతో బాధపడుతుండటం సరేసరి.

కాగా, అంతకుమించి కలుషితాహారంతో తరచూ ఆస్పత్రుల పాలవుతుండగా కండ్లు తెరువనిది ఎందుకు? ఇంకా సూటిగా అడగాలంటే... కండ్లు తెరవలేకపోవటంలో రహస్యమేమిటి? ఆ విద్యార్థుల్లో కొందరు ప్రాణాలు కోల్పోయినా వీరికి విద్యారంగ పరిరక్షణ అవసరమని తోచలేదా? విద్యార్థులైన చిన్న పిల్లల ప్రాణాలూ పట్టలేదా?

రైతాంగం ఎంతెంత గగ్గోలు పెడుతున్నది? రైతు బంధు సమయానికి అందక తిరిగి అప్పులపాలవుతూ, రైతు బీమా పూర్తిగా ఆగిపోయి చిన్నరైతుల కుటుంబాలు వీధినపడుతూ, యూరియా దొరకక పంట ఎర్రబారి రైతులు రాత్రంతా క్యూలల్లో చలివేళ ముసుగుదన్ని పడుకుని, పంట దిగుబడి సగానికి తగ్గుతూ ఇంటిల్లిపాది తిరిగి రోదిస్తున్న పాడుకాలం తిరిగి రాగా, మేధావులు తమ గుడ్డి కండ్లకు గంతలు కూడా కట్టుకున్నారెందుకు? పెన్షన్ల హెచ్చింపు సహా అనేక హామీలు కొడిగట్టి పోతుండగా, గత ప్రభుత్వపు అప్పుల భారమంటూ సాకులు చెప్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి వంత పాడటానికి మినహా, అధిక అప్పులనే వాదన పచ్చి అబద్ధమంటూ కేంద్ర సంస్థలు ప్రకటిస్తున్న నివేదికలు ఈ నకిలీ మేధావులకు కనిపించటం లేదు. విషయం ఏమిటంటే, నగరాలలో సుఖంగా బతికే ఈ భద్రలోక మేధావులకు గ్రామీణుల సమస్యలు, వారి కష్ట సుఖాలు, మనోభావాలతో సంబంధం లేదు. తాము నివసించే నగరాలలోని మూసీ తీరపు పేదల వంటివారి జీవితాలు, ఆక్రందనలతో నిమిత్తం లేదు. పొరుగున గల లగచర్ల కంటికి ఆగదు. వీరు సుఖజీవులు. వీరి దృష్టికి వారివేవీ పౌరహక్కులు కావు. వారి దృష్టిలో పౌర హక్కులు వారి ఏసీ భవనాలు, ఏసీ కార్లు, లంచ్ వరకు ఇందిరా పార్క్ ధర్నాలు, ఏసీ హాళ్లలో రొడ్డుకొట్టుడు ఉపన్యాసాలు, మరునాడు పత్రికల్లో ఫొటోల చుట్టూ తిరుగుతుంటాయి. నక్సలైట్ ఉద్యమకాలంలో అంతకుమించి చాలానే చేశారు. కానీ ఆ దశ శంకరన్, కన్నాభిరాన్, బాలగోపాల్‌లతో ముగిసిపోయింది. ఇపుడు మిగిలిందంతా రాజకీయో, పట్టణీ, మేధోవిలాసాలు మాత్రమే. ఆబ్జెక్టివిటీ నుంచి సబ్జెక్టివిటీగా రూపాంతరం చెంది, దానినే ఆబ్జెక్టివిటీగా ప్రదర్శించే మేధో విన్యాసాలు మాత్రమే.

అందువల్లనే కాంగ్రెస్ ప్రచార రథాలకు జండాలు ఊపుతారుగాని, అదే అశోక్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు నిరాశకు గురై నిరసనలు తెలిపి పోలీసు లాఠీఛార్జ్‌లకు గురైతే అటు పోయి వారికి సంఘీభావం తెలిపేందుకు సాహసించలేరు. ఓట్లను ఆశించి వచ్చిన రాహుల్ గాంధీ మహాశయుడు ఆ నిరుద్యోగులతో వేడి వేడి చాయ్‌లు తాగి, తమను ఆహ్వానిస్తే మురిసిపోయి వెళ్ళి లంచ్ చేసి కీర్తిస్తారు గాని, అదే నాయకుడిని అదే నిరుద్యోగులు 'రావయ్యా..రా, మా ప్రశ్నలకు జవాబు చెప్పు' మని నిలదీస్తే వారితో పాటు గొంతు కలుపలేరు. ఈ ధోరణిపై ప్రశ్నలు ఎదురవుతే నేలచూపులు చూస్తారు, దిక్కులు చూస్తారు, నంగినంగిగా మాట్లాడుతారు, నీళ్లు నములుతారు. అంతే తప్ప ఇప్పటికీ కండ్లు మాత్రం మూసుకునే ఉంటారు.

వీరికి ఎంతమాత్రం తీసిపోనివారు కమ్యూనిస్టు నాయకోత్తములు. వారికి ఎవరు సీట్లు బిచ్చమేస్తే వారినే ప్రజోద్ధారకులని కీర్తించి, ఆ బిచ్చం వేయని పాపానికి ఇతరులను ప్రజాద్రోహులంటూ తమ జెండాలోని కొడవళ్లను కిందకు తీసి ఖండిస్తారు. తదుపరి ఎన్నికల్లో తిరిగి ఈ సీట్ల బిచ్చాన్ని బట్టి ఈ పాత్రలు తారుమారవుతుంటాయి. దివాంధ మేధావులకు తీసిపోని ఈ డయలెక్టికల్ అంధులకు కూడా పైన పేర్కొన్న ఏ నివేదికలూ కనిపించవు. అందుకు అనుగుణంగా మూసీ బాధితులు, లగచర్ల రైతులు, చెక్‌డ్యాముల పేల్చివేతలు, గురుకుల విద్యార్థుల వెతలు, దళిత బంధు, రైతు బీమా ఎగవేతలు, రైతు బంధు ఆలస్యాలు, యూరియా ఇక్కట్లు, మహిళలకు కిట్ల నిలిపివేత, వందలాది హామీల ఎగవేత మొదలైనవేవీ దృష్టికి రావు గాక రావు. ఆ విధంగా వీరు కండ్లుండీ కబోదులైన కామ్రేడ్లు. అందువల్ల, అనేకానేక నివేదికలలో తాజాది అయిన ఆర్థిక సర్వే వీరి కండ్లు తెరిపించగలదేమోనని ఆశించి నిరాశ చెందవద్దు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మీరు, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సింది పోయి, తెలంగాణ సాధకుడు కేసీఆర్ పట్ల రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న మీ దురహంకార తీరును నిరసిస్తూ ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని రాజకీయ దాడులు చేసినా.. తెలంగాణ సమాజం కేసీఆర్‌ను ఎప్పుడూ తన గుండెల్లోనే పెట్టుకుంటుంది. ఎందుకంటే ఆయన కేవలం ఒక పార్టీకి అధ్యక్షుడు కాదు.. ఈ జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక అజేయమైన శక్తి. కేసీఆర్ అంటే ఒక మనిషి కాదు.. ఆయన తెలంగాణ అస్తిత్వ జ్వాల! ఆయన్ని ఆర్పాలనుకోవడం నీ వల్ల కాదు సరికదా, ఆ ప్రయత్నంలో నీవు, నీ అహంకారమే భస్మమైపోతుంది.


అహంకారంతో, అధికారం చేతిలో ఉంది కదా అని కేసీఆర్‌ను రాజకీయంగా అణచివేయాలని చూస్తే.. అది కేవలం ఒక వ్యక్తిపై చేస్తున్న దాడి కాదు, అది తెలంగాణ ఆత్మగౌరవం మీద చేస్తున్న దాడి అని ప్రజలు భావిస్తున్నారు. పాలకుల అహంకారానికి, ప్రజల ఆత్మాభిమానానికి మధ్య జరిగే యుద్ధంలో ఎప్పుడూ ఆత్మాభిమానమే గెలుస్తుంది. ప్రపంచ చరిత్ర పాఠాలను ఒక్కసారి తిరగేయండి.. ఏ పోరాట యోధుడినైనా ఎంత అణగదొక్కాలని చూస్తే, ప్రజల్లో అంతటి సానుభూతి, అంతకు వెయ్యి రెట్లు ప్రజా మద్దతు వెల్లువెత్తుతుంది.

కేసీఆర్ ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన 'తెలంగాణ ఎమోషన్'. ఆయన పోరాటపటిమ, దార్శనికతకు నిలువుటద్దం. తన మేధస్సుతో, త్యాగశీల పోరాటంతో, అచంచలమైన దార్శనికతతో ఆంధ్రా పాలకుల సంకెళ్ళ నుండి తెలంగాణను విముక్తి చేయడమే కాదు. కునారిల్లిన ఈ నేలను 'బంగారు తెలంగాణ'గా తీర్చిదిద్దిన అపర భగీరథుడు ఆయన. ఆ ఉక్కు సంకల్పం, కృషి, సాధించిన ప్రగతి ప్రజల కండ్ల ముందే ఉన్నాయి. రేవంత్‌రెడ్డి... ఒక్కటి మాత్రం గుర్తుంచుకో.. కేసీఆర్ అంటే కేవలం మూడు అక్షరాల పేరు కాదు.. 'తెలంగాణ సింహనాదం'. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు.. ఆయన కోట్లాది మంది తెలంగాణ ప్రజల గుండెచప్పుడు! మీ తప్పుడు కేసులతో, కేసీఆర్ ఈ గడ్డ విముక్తికోసం చేసిన మడమతిప్పని ప్రజాపోరాటాలను చెరిపివేయలేవు. మీ రాజకీయ కక్షసాధింపులు కేసీఆర్ స్థాయిని ఏమాత్రం తగ్గించలేవు. పైగా ఆయన పట్ల ప్రజలకున్న గౌరవాన్ని, ప్రేమాభిమానాలను మరింత పెంచుతాయి. మీరు సూర్యుడిపై ఉమ్మి వేస్తున్నారు అన్న విషయాన్ని గుర్తించకపోవడం, మీ మూర్ఖత్వం. 'ప్రజాస్వామ్యంలో అధికారం అనేది శాశ్వతమైన ప్రైవేట్ ఎస్టేట్ పట్టా కాదు, అది ప్రజలు రాసిచ్చిన షరతులతో కూడిన కొద్దికాలపు నమ్మకం' మాత్రమే. కుర్చీ మీద కూర్చున్నప్పుడు విర్రవీగడం కాదు, ఆ కుర్చీ దిగిపోయాక ప్రజలు నీ ముఖం చూసి 'ఛీ' అనకుండా ఉండటమే అసలైన విజయం. అధికారం అనేది కేవలం ఐదేండ్ల 'అద్దె ఇల్లు' మాత్రమే. ఈరోజు అధికార దాబు, దర్పం, నీ చుట్టూ ఉన్న భజన బృందం, పోలీసులు, రేపు నీ పదవి పోయాక నీ నీడను కూడా తాకరు. అప్పుడు నీతో ఉండేది నువ్వు చేసిన మంచి పనులు మాత్రమే. అధికారాన్ని ప్రజల కష్టాలు తీర్చే వారధిగా వాడాలి తప్ప, ప్రత్యర్థుల గొంతు కోసే 'కత్తి'గా వాడితే.. అదే కత్తి నీ మెడకు చుట్టుకుంటుందని మర్చిపోకు. ప్రజలు నిన్ను ఎన్నుకుంది ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించడానికే తప్ప, ప్రతీకార క్షుద్ర రాజకీయాలు చేయడానికి కాదు. నాయకుడు అంటే నిర్మించేవాడు, అహంకారంతో కండ్లు మూసుకుపోయి, విచ్చలవిడి అవినీతికి పాల్పడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగపరుస్తూ, ప్రత్యర్థులను హింసిస్తే, చరిత్ర నిన్ను ఒక 'రాజకీయ విలన్' గానే ముద్రవేస్తుంది. అధికారం ఉన్నప్పుడు అణచివేతకు పాల్పడే నాయకుడు, అధికారం పోయాక అనామకుడిగా మిగిలిపోతాడు. గుర్తుంచుకో.. కాలం ఎప్పుడూ నీ చుట్టే తిరగదు, అది తిరగబడినప్పుడు నీ అహంకారం నిన్ను కాపాడలేదు. మీ చేతకానితనాన్ని, పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్‌పై అసభ్య పదజాలంతో విమర్శలు చేయడం, తప్పుడు కేసులతో వేధించడం మానుకోండి.

# బడ్జెట్‌లో తెలంగాణకు 'సున్నా'

ఎన్నో ఆశలతో బడ్జెట్ కోసం ఎదురుచూసిన మధ్యతరగతికి నిరాశే ఎదురైంది. వికసిత్ భారత్ అంటూనే 'డల్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కర్తవ్య పథ్ అంటూనే ఖర్చుల విషయంలో కన్నెర్రజేసింది. ఈ బడ్జెట్‌లో మిడిల్ క్లాస్‌కు ఎటువంటి పెద్ద ట్యాక్స్ ఊరట లేదు. పెద్దపాటి ఆదాయ పన్ను స్లాబుల్లో సందర్భోచితమైన ఊరట కూడా కనిపించలేదు. అటు స్టాక్ మార్కెట్‌లో సంస్కరణలు తెస్తామని ప్రకటిస్తూనే స్టాక్ మార్కెట్ కుప్పకూలే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు సాగాయి. వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామీణ ఆర్థికాన్ని బలోపేతం చేస్తూ యువత, మహిళ, అన్నదాతలకు అత్యధిక నిధులు కేటాయిస్తారని ఆశించగా నిరాశే ఎదురైంది.. ఆర్థిక సర్వేలో పేర్కొన్నట్టు 6.87.2 మధ్య వాస్తవ వృద్ధిని సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా నిధుల కేటాయింపు జరగలేదు.

ఆర్థిక వ్యవస్థలో ప్రజల వినియోగం పెరిగితేనే డిమాండ్ పెరుగుతుంది. మార్కెట్‌లో డిమాండ్ పెరిగితేనే ఉత్పత్తి పెరుగుతుంది, తద్వారా జీడీపీ పెరిగి ఉద్యోగావకాశాలు కూడా పెరిగి, నిరుద్యోగం తగ్గి పేదరికం మరింత తగ్గుతుంది. ఇది సింపుల్ సూత్రం. మరి వినియోగం పెరగాలంటే పన్నుల విధింపులో ఉపశమనం ఉండాలి. పన్నులు తగ్గాలి. పన్నుల హేతుబద్ధీకరణ జరగాలి. కానీ పన్ను స్లాబుల్లో ఎలాంటి ఊరట లభించలేదు. తగ్గకపోగా పెట్టుబడులను ప్రోత్సహించే మూలధన మార్కెట్‌లో ఆశలకు కొత్త బడ్జెట్ పూర్తి విరుద్ధంగా ఉంటూ వినియోగదారులలో నిరాశను కలిగించింది. ఈ బడ్జెట్ మదుపర్ల ఆశలను పూర్తిగా తుంచి వేసి మార్కెట్ సెంటిమెంట్‌లను మరింత దెబ్బతీసింది. అంటే బడ్జెట్ ప్రతిపాదనలు మార్కెట్‌కు నచ్చలేదు అని అర్థం. పన్నుల నుండి తప్పించుకునే వారిని పన్ను పరిధిలోకి తేవడం, పన్ను వసూళ్లలో సాంకేతికత, హేతుబద్ధీకరణ తీసుకురావడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలి తప్ప అధిక పన్నులు వేసి కాదు.




తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్నా మిగిలింది. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది... వికసిత్ భారత్‌కు వెన్నుదన్నుగా నిలుస్తామని రాష్ట్రానికి ప్రగతి రెక్కలు తొడిగి లక్ష్యాన్ని సాధించడానికి తమకూ అవకాశమివ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రతిపాదనలు చేసింది. వాటిపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో 202627 బడ్జెట్‌పై తెలంగాణకు భారీ ఆశలు ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రతిపాదనలను కేంద్రం పెడచెవిన పెట్టింది. దాదాపు 1.2 లక్షల కోట్ల విలువతో తెలంగాణ రాష్ట్రం ఈ నూతన బడ్జెట్ కోసం కేంద్రానికి చేసిన ప్రతిపాదనలలో ముఖ్యమైనవి ఇవి.హైదరాబాద్ చుట్టూ 350 కి.మీ పక్కా రోడ్ల అభివృద్ధికి రూ.45,000 కోట్లు, గ్రీన్‌ఫీల్డ్ రహదారుల అభివృద్ధి కోసం రూ.45,000 కోట్లు, 4 విమానాశ్రయాలు (మామునూరు, ఆదిలాబాద్, పాల్వంచ, బసంత్‌నగర్) నిర్మించడానికి రూ.1,100 కోట్లు, 350 కి.మీ పొడవు రైల్వే మార్గాలకు నిధులు, హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్2 విస్తరణకు రూ.2,426 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.17 వేల కోట్ల మంజూరును కోరింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏ ప్రాజెక్టును కూడా పరిగణించకుండా కేంద్రం మొండిచేయి చూపింది. అయితే, కేంద్రం కేవలం హైదరాబాద్‌బెంగళూర్, హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌పుణె మధ్య మూడు హైస్పీడ్ రైలు మార్గాలపై ముక్తసరి ప్రకటన తప్ప తెలంగాణకు ఈ బడ్జెట్‌లో ఏ కేటాయింపులూ చేయలేదు. 8 మంది ఎంపీలను కేంద్రానికి ఇచ్చిన తెలంగాణకు ఇచ్చింది మాత్రం సున్నా. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి నిధులు తగ్గబోతున్నాయి. అలాగే పన్ను రేట్ల హేతుబద్ధీకరణ వలన కూడా రాష్ట్రం రూ.7 వేల కోట్లకు పైగా నష్టాలను చూడబోతున్నది. ఆ దిశగా ఆలోచించి కొన్ని గ్రాంట్లను విడుదల చేయాలని తెలంగాణ కోరింది. కానీ ఆ దిశగా కూడా బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ హబ్‌గా ఉంది. కానీ, దానిని కూడా ముంబయికి తరలించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా అందులో కూడా తెలంగాణ లేదు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదు. రూ.57.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు కొంతమేర నిధులు ఇచ్చినా వికసిత్ భారత్‌కు మరింత సాయం అందించలేదు. పలు రంగాలకు అరకొర నిధుల కేటాయింపు వలన వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం అవుతుంది.


తెలుగు దిన పత్రిక https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్

## జాతరలు దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి
# నిర్వహించే పవిత్ర ఉత్సవాలు

- బి.ఆర్.ఎస్. ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** జాతరలు దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి నిర్వహించే పవిత్ర ఉత్సవాలని బి.ఆర్.ఎస్. ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ వేణుగోపాల స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్. ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిధిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు అందించే గొప్ప ఉత్సవాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో కలసి ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు, అలాగే గ్రామాభివృద్ధితో పాటు సంప్రదాయాలను కాపాడటమే తమ లక్ష్యమని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇంద్రసింగ్ ఠాకూర్, శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, బలవంత రెడ్డి పటేల్, సామల నరసింహ రెడ్డి, పెద్ది మల్లేష్, మురళి గౌడ్, నార్లకంటి నాగేష్, బిక్షపతి గౌడ్, నరహరి, కె. ఎం. ప్రకాష్ గౌడ్, నార్లకంటి శ్యామ్, ఆటో బలరాం, కుంట వేణు, డివిజన్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, 130 డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ ,భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## బాచుపల్లి స్మశాన వాటిక తొలగింపు అంశంపై
# మంత్రి శ్రీధర్ బాబు కి వినతి

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని కొనసాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. బాచుపల్లి ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా కొనసాగుతున్న స్మశాన వాటికను తొలగించాలనే ప్రతిపాదనపై మంగళవారం ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఏర్పడిన కొత్త కాలనీ నివాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, స్మశాన వాటికను తొలగిస్తే సుమారు 50 వేల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు స్మశాన వాటిక అనేక సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడుతోందని కోరారు.దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామ ప్రజలు ,పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ను నిర్వహించామని తెలిపారు. చిల్డ్రన్ ఫ్రెండ్లీ పోలీస్ భావనకు అనుగుణంగా ఈ టాలెంట్ టెస్ట్ కు జీడిమెట్ల ప్రాంతంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 366 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం, విశ్లేషణాత్మక నైపుణ్యాలను గుర్తించే విధంగా ప్రశ్నాపత్రం రూపొందించామన్నారు.ఈ పరీక్షలో ప్రతిభ చూపిన ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి, వారికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు విజిట్ ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విజిట్ ద్వారా విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగల అరెస్టు

**అక్షర గళం, కూకట్ పల్లి:** కూరగాయల మార్కెట్ లో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళల హ్యాండ్‌బ్యాగులు దొంగిలిస్తున్న ముగ్గురు మహిళలను కూకట్ పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌హెచ్ఓ కె.వి.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం......మూసాపేట ప్రగతినగర్‌కు చెందిన లోపెట్టి నాగమణి గత నెల 13న రాత్రి స్థానిక మార్కెట్‌లో కూరగాయలు కొంటుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను అపహరించారు. అందులో రూ.40 వేల నగదు ఉన్నట్లు బాధితురాలు జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మంగళవారం ఉదయం వై జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఫతేనగర్, సనత్‌నగర్‌కు చెందిన బండారి షాలిని(34), గంబూ మహేశ్వరి(43), ఉప్పు సరిత(38)గా గుర్తించారు. నిందితులు రద్దీగా ఉండే ప్రాంతాలు, జాతరలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఎస్‌హెచ్ఓ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మార్కెట్లు, మాల్స్ వంటి రద్దీ ప్రదేశాలకు వెళ్లే మహిళలు తమ వెంట తెచ్చుకునే బ్యాగులు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.




## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

(మొదటిపేజీ తరువాత)




ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజ స్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గ్దదె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు.



## చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

**అక్షర గళం, చందానగర్ :** వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పట్టపగలు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని చందానగర్ పోలీసులు, సైబరాబాద్ ఎస్ఓటీ, సీసీఎస్ బృందాలతో కలిసి అరెస్ట్ చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో శేరిలింగంపల్లి ఏసీపీ సిహెచ్ వై. శ్రీనివాస్ కుమార్ వివరాలు వెల్లడించారు. చందానగర్ పోలీసులకు రెండు చైన్ స్నాచింగ్లకు సంబంధించి రెండు వేర్వేరు ఫిర్యాదులు అందాయన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ పరిధిలోని రామాలయం టెంపుల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న 72 ఏళ్ల వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని నిందితుడు పరారయ్యాడన్నారు. అదే సమయంలో సమీపంలోనే మరో 73 ఏళ్ల వృద్ధ మహిళను అడ్డగించి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయాడు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు రంగారెడ్డి జిల్లా లింగంపల్లి గోపినగర్‌కు చెందిన డి. రాజేష్(32)గా గుర్తించామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి పర్యవేక్షణలో శేరిలింగంపల్లి జోన్ అడిషనల్ డీసీపీ ఉదయ్ రెడ్డి నేతృత్వంలో ఈ కేసును ఛేదించారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.


## "రేగుల కుంట" లో
# రయ్ రయ్ మంటూ కబ్జా

- సర్వే నంబర్ మాయాజాలంతో అక్రమ కట్టడం
- 151 చెరువు భూమికి బదులుగా..
- 150 లో ఉన్నట్లుగా చూపిస్తూ అనుమతులు
- పరిశీలన చేయకుండానే జిహెచ్ఎంసి శేర్లింగంపల్లి జోనల్ పర్మిషన్
- గతంలోని ఆ ప్రాంతం చెరువు భూమిగా పేర్కొంటూ రాజేంద్రనగర్ ఆర్డిఓ రిపోర్ట్
- పరిశీలించి చర్యలు తీసుకుంటాం: హుస్సేన్ సాగర్ లేక్ డివిజన్ అధికారులు


**అక్షరగళం, శేరిలింగంపల్లి :** అధికారిక సర్వేలో చెరువు భూమిగా తేలింది... ఆ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణాలతో చేసుకున్నాయని నివేదికన సైతం రూపొందించారు అధికారులు. అయినప్పటికీ చర్యలు లేకపోవడంతో తప్పుడు ప్లాట్ నెంబర్లు, తప్పుడు సర్వే నెంబర్లను పేర్కొంటూ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవడం... పరిశీలన చేయకుండానే జిహెచ్ఎంసి అధికారులు అనుమతులు విచ్చేయడంతో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం హఫీజ్ పేట్ సర్వేనెంబర్ 151 లో ఉన్న రేగులకుంట చెరువు, ప్రభుత్వ భూమిలో ప్రస్తుతం మరొక అక్రమ కట్టడం రయ్ రయ్ మంటూ కొనసాగటం ఆందోళన కలిగించే అంశం.

**తప్పుడు సర్వే నెంబర్లతో..**


రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, హఫీజ్‌పేట్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు: 119 నుండి 126, 128 నుండి 137, 138/1, 138/2, 139 నుండి 150, 152 నుండి 156, 158 అదే విధంగా చందానగర్ గ్రామ సర్వే నెంబర్ 287 లో ఉన్న భూములలో దీప్తిశ్రీ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఫేజ్ I, ఫేజ్ II, ఫేజ్ III యొక్క సవరించిన తుది లేఅవుట్ ఉన్నది. సర్వే నెంబరు 151 రేగులకుంట చెరువు కి పక్కనే దీప్తి శ్రీనగర్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ లో ఒకటైన సర్వే నెంబరు 150 పట్టా భూమి ఉన్నది. ఈ పట్టా భూమిని చూపిస్తూ అక్రమ నిర్మాణదారుడు చెరువు భూమి అయిన సర్వేనెంబర్ 151 లో నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. లేఅవుట్ లో లేని భూమిలో లేని ప్లాట్ ను చూపిస్తూ నిర్మాణదారుడు పత్రాలను సృష్టించి అనుమతులు తీసుకొని నిర్మాణ పనులు చేస్తున్నారని తీవ్ర విమర్శలు ఉన్నాయి.



రాజేంద్రనగర్ ఆర్డిఓ అధికారులు రూపొందించిన స్కెచ్ ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న కబ్జా రెడ్ మార్కులో ఉన్న ప్రాంతం.




రాజేంద్రనగర్ ఆర్డిఓ అధికారులు రూపొందించిన హఫీజ్ పెట్ రేగులకుంట చెరువు స్కెచ్.



ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న నిర్మాణం

### రికార్డులో చెరువు భూమిగా

శేరిలింగంపల్లి మండలం హఫీజ్ పేట్ గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 151 లో 17 ఎకరాల 14 గుట్టల భూమి రేగులకుంట చెరువుగా రికార్డు అయి ఉన్నది. ఇటీవల అధికారులు రూపొందించి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు అందజేసిన రిపోర్టులో సైతం ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. సదరు భూమిని 22 A (1) (b) గా నమోదు చేసి నిషేధిత జాబితాలో ఉంచారు. అయితే చెరువు పరిధిలో తప్పుడు డాక్యుమెంట్లు, మోసపూరిత సర్వే నంబర్లతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.




చెరువు యొక్క బఫర్ జోన్, ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న నిర్మాణం

### గతంలో ఆర్డీవో రిపోర్టులో సైతం

దీప్తి శ్రీనగర్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ కు పక్కనే ఉన్న రాగులకుంట చెరువు భూమిలో సైతం ప్లాట్లను సృష్టించి అక్రమ నిర్మాణాలు చేసినట్లుగా గతంలో రాజేంద్రనగర్ ఆర్టీవో నివేదికను రూపొందించారు. మొత్తంగా ఆరు ప్లాట్ లలో 1200 గజాలకు పైగా భూమి సర్వే నెంబర్ 151 రాగులుకుంట చెరువు ప్రాంతంలోకి వస్తుందని స్కెచ్ సైతం రూపొందించారు. అయితే ఆ రిపోర్టు కేవలం పేపర్లకే పరిమితం అవ్వడంతో చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం అక్కడ అక్రమ నిర్మాణం ఏదేచ్ఛగా కొనసాగుతుంది. ఈ విషయంపై ఇప్పటికే స్థానికులు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం తో పాటుగా శేర్లింగంపల్లి జోనల్ కార్యాలయం అదేవిధంగా ఇరిగేషన్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. కాగా సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు. ఈ అక్రమ కబ్జాలు కొనసాగితే, భవిష్యత్తులో వరద ప్రమాదాలు, భూగర్భ జలాల తగ్గుదలతో పాటు కోట్ల రూపాయలు విలువచేసే ప్రజా ఆస్తి పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి, అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు భూమిని రక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




రేగులకుంట చెరువు

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలి
- కల్వకుర్తి ఆమనగల్ మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ విజయం ఖాయం
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి
- బిఆర్ఎస్ అభ్యర్థులకు బి ఫాంలు అందజేత



**కల్వకుర్తి ఫిబ్రవరి 3 (అక్షర గళం):** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సర కాలంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు పరుస్తామని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గారెంటీలు 420 హామీలను ప్రశ్నిస్తే అక్రమ కేసులను పెడుతున్నారని రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని ముంచిపల్లె ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన బిఆర్ఎస్ అభ్యర్థులకు బీఫామ్ అందజేశారు అనంతరం మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కల్వకుర్తి ఆమనగల్ బిఆర్ఎస్ విజయం ఖాయమని అన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం లోనే కోట్లాది విరూపాయలు వెచ్చించి పాలిటిని ఎంతగానో అభివృద్ధి చేశామని ప్రజలు అభివృద్ధిని చూసి పట్టం కడతారని అన్నారు కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మవద్దని బి ఆర్ ఎస్ అభ్యర్థులను గెలిపించాలని 22 వార్డుల్లో బిఆర్ఎస్ విజయం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం వైస్ చైర్మన్ మహమ్మద్ చాహిద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ బి ఆర్ ఎస్ మున్సిపల్ అభ్యర్థులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యూపీఐ ద్వారా నగదును కొల్లగొడుతున్న నిందితుడు రిమాండ్


**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** సెల్‌ఫోన్‌ను దొంగిలించి యూపీఐ ద్వారా నగదును కొల్లగొడుతున్న నిందితుడిని సూరారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. సూరారం ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ వివరాలను వెల్లడించారు. నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్ మొబైల్ ఫోన్‌ను దొంగిలించి, డిజిటల్ పేమెంట్స్ ద్వారా భారీగా నగదును అక్రమంగా కాజేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. జనవరి 7వ తేదీ తెల్లవారుజామున హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ చోరీకి గురైందని, ఆ మొబైల్‌లోని యూపీఐ యాప్ ద్వారా బాధితుడి ఖాతా నుంచి సుమారు రూ.8,00,000 లను నిందితుడు అక్రమంగా మళ్లించినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సూరారం క్రైమ్స్ టీమ్ సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు బ్యాంక్ లావాదేవీలను సాంకేతిక ఆధారాలతో విశ్లేషించి నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. మెదక్ జిల్లా కవిడిపల్లి గ్రామానికి చెందిన బూరడ ఆది నారాయణ (34)గా నిందితుడిని నిర్ధారించి అతడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడిన ఒక మొబైల్ ఫోన్‌తో పాటు రూ.6,73,000 నగదును స్వాధీనం చేసుకున్నామని, రికవరీ చేసిన మొత్తం సొత్తు విలువ సుమారు రూ.7,00,000/ వరకు ఉంటుందని వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కేసును తక్కువ సమయంలోనే ఛేదించిన సూరారం క్రైమ్ టీమ్ సిబ్బందిని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజలు ఆసుపత్రులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లకు, బ్యాంకింగ్ యాప్స్‌కు తప్పనిసరిగా సెక్యూరిటీ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.



## అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా

- ఐదోవార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐదోవార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రాము అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. 11న జరిగే ఎన్నికలో కారు గుర్తుకు ఓటువేసి తనను కౌన్సిలర్ గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాలు భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండరు ఇస్తామని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజారిటీతో పదో వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని కోరారు. ఆశీర్వదించి గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో చలిచీమల సతీష్, జంతుక కిరణ్, పూసల భాస్కర్, కార్తీక్, శ్రీరాములు, రాఘవేందర్, చింటూ, భరత్, శివ, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.



## అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- తొమ్మిదో వార్డు అభ్యర్థి మహేష్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** కౌన్సిలర్ గా అవకాశం ఇస్తే వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి ఎర్రవోలు మహేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో మురికినీరు పూర్తిగా రోడ్లపై పారుతుందన్నారు. ఇండ్ల ముందు మురికినీరు నిలుస్తుండడంతో దుర్గం వెదజల్లుతుందన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డు 'ప్రజలను పట్టి పీడిస్తున్న దుర్గంధం సమస్య నుంచి ప్రజలకు శాశ్వత విముక్తి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో ధోనాదుల మహేష్, ఉప సర్పంచ్ వరికుప్పల శ్రీను, జజ్జేల ఆనంద్, శ్రీను, పురుగుల శివ, దాస్యం వంశీ, చింటూ, సాయి, సతీష్, శ్రీకాంత్, రమేష్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## రీల్స్... ఏఐ కాల్స్

- పురపోరులో వినూత్నంగా అభ్యర్థుల ప్రచారం
- ఓటర్లను ఆకర్షించేలా సోషల్ మీడియా వాడకం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారానికి సరికొత్త దారిని ఎంచుకుంటున్నారు. గెలుపే ధ్యేయంగా ఓటర్లను ఆకర్షించేలా సాంకేతికతను వాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

**రీల్స్.. షార్ట్ వీడియోలు**

ప్రస్తుతం అందరి చేతుల్లో మొబైల్స్ సర్వసాధారణం. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఓటర్లందరూ అభ్యర్థులకు తెలిసే అవకాశం తక్కువ. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరుకు తమ సందేశం చేరేలా అభ్యర్థులు సోషల్ మీడియాను ఎంచుకున్నారు. ఇన్స్టాగామ్ రీల్స్ చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా షార్ట్స్ చేస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. స్థానిక సమస్యలపై వివరిస్తూ తమను గెలిపిస్తే పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. వార్డుల్లో రోజూవారీగా చేస్తున్న ప్రచారాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ప్రచారానికి ఉపయోగిస్తున్న కరపత్రాలపై క్యూఆర్ కోడ్లను ముద్రిస్తూ వాటి ద్వారా తమ వీడియో సందేశాన్ని ఓటర్లకు చేరవేస్తున్నారు.

**ఏఐ కాల్స్...**

అభ్యర్థులు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను సైతం విరివిగా వాడుతున్నారు. అభ్యర్థుల స్వరంతో ఓటర్లకు వ్యక్తిగతంగా ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఏఐ ద్వారా ప్రచార పోస్టర్లను తయారు చేయిస్తున్నారు.



## బీఆర్ఎస్ లో బీఫామ్ లొల్లి లొల్లి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య బీఫామ్ లొల్లి తారాస్థాయికి చేరింది. పార్టీ బీఫామ్ అందజేయడానికి మంగళవారం ఆఖరి తేదీ కావడంతో ఉత్కంఠ నెలకొంది. మొత్తం 15 వార్డుల అభ్యర్థులకు బీఫామ్ అందజేయడానికి ఇవాళ ఆమనగల్లు మున్సిపాలిటీ ఇన్చార్జి రాష్ట్ర గిడ్డంగుల మాజీ వైస్ చైర్మన్ రజనీ సాయి చందు, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అయితే 14వ వార్డ్ నుంచి వస్పుల సాయిలు, వస్పుల సుగుణ నామినేషన్ వేయగా బీఆర్ఎస్ పెద్దలు వస్పుల సాయిలుకు పార్టీ బీఫామ్ అందించడంతో వస్పుల సుగుణ మద్దతుదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కుర్చీలను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. అధిష్ఠానం పెద్దలు సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో వారు అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. వస్పుల సుగుణ ఇతర పార్టీ వైపు మొగ్గు చూపుతుందా అని వార్డు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ఆమనగల్లులో బీజేపీ అభ్యర్థులు వీరే..

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** మున్సిపాలిటీలో 15 వార్డులకు పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థుల జాబితాను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మంగళవారం ప్రకటించారు. 1వ వార్డు జటావత్ ధోళి, 2వ వార్డుకు చాట్ల శ్రీదేవి, 3వ వార్డు తల్లోజు గీత, 4వ వార్డు కండె హరిప్రసాద్, 5వ వార్డు జంతుక జానయ్య, 6వ వార్డు నేనావత్ నరేందర్, 7వ వార్డు నిరంజన్, 8వ వార్డు గోరటి నర్సింహా, 9వ వార్డు ఎర్రవోలు మహేష్, 10వ వార్డు బన్నే లక్ష్మమ్మ, 11వ వార్డు సునీత, 12వ వార్డు చుక్క అల్లాజీ గౌడ్, 13వ వార్డు భారతీ, 14వ వార్డు మొక్తల వెంకటయ్య, 15వ వార్డు కండె సీత రాములమ్మ లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తొమ్మిదో వార్డు అభ్యర్థి గుర్రం కేశవులు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తొమ్మిదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం కేశవులు అన్నారు. మంగళవారం తొమ్మిదో వార్డులోని శ్రీకాంత్ కాలనీ, వెంకటగిరి, పోస్ట్ ఆఫీస్ కాలనీ, విద్యానగర్ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వార్డుల్లో అనేక సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తొమ్మిదో వార్డు నుంచి పోటీ చేస్తున్నందున తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తను నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట గుజ్జుల మహేష్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ కరీం, సురేష్ నాయక్, యోగి, రమేష్, సలీం, రహీం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.




## కల్వకుర్తి మున్సిపల్ బరిలో 81 మంది అభ్యర్థులు

**కల్వకుర్తి ఫిబ్రవరి 3 (అక్షర గళం):** కల్వకుర్తి ముంచిపాలిటీ ఎన్నికల బరిలో 22 వార్డుల్లో 81 అభ్యర్థులు పోటీలో ఉన్నారు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కాంగ్రెస్ పార్టీ నుండి 22 మంది బిఆర్ఎస్ నుండి 22 మంది బిజెపి నుండి 21 మంది ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు బి.ఎస్.పి నుండి ఒక్క అభ్యర్థి పోటీలో ఉండగా సిపిఐ నుండి 11వ వార్డులో ధారాదాసు పోటీలో ఉన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల నుండి టికెట్లు దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉండగా మరి కొంతమంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన రాజు యాదవ్



**కల్వకుర్తి ఫిబ్రవరి 3 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాసుల రాజు యాదవ్ మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయతి విజయ్ కుమార్ రెడ్డి మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి శానవాజ్ ఖాన్ నాని యాదవ్ తదితరులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల కుటుంబాలకు భరోసా

**కల్వకుర్తి ఫిబ్రవరి 3 (అక్షర గళం):** సీఎం రిలీఫ్ ఫండ్ పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా సహాయపడుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని వెల్దండ మండలానికి చెందిన పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక సహకారం అందించామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని రాగాయిపల్లి గ్రామానికి చెందిన నాగుల కృష్ణయ్య ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 39వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును పార్టీ జిల్లా నాయకులు నాగుల నాయక్ కు అందజేశారు అనంతరం బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పేదలకు మధ్యతరగతి కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడం సులభతరం అవుతుందన్నారు గోలి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగతంగా బాధ్యత కుటుంబాలను పరామర్శించి వారికి తక్షణ ఆర్థిక సహాయం అందజేస్తున్నారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండలం మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్ చెరుకూరు గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు తలకొండపల్లి బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి రామాయపల్లి గ్రామ ఉపసర్పంచ్ కొండల్ యాదవ్ నాగుల శ్రీనివాస్ నరసింహ వర్గం గణేష్ మహేష్ రామచంద్రయ్య జంగయ్య చోటమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- సర్పంచ్ రాజేశ్వరి
- ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ అన్నారు. మండల పరిధిలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో నూతన సీసీ రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ లు ,ఏఈ అభిషేక్, ఇంచార్జి ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి జగన్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మల్లేష్, ప్రేమలత, జయందర్, సితి, కవిత మణిపాల్, సీతారాం, భారతి మణిపాల్, దేవేందర్, తావుర్య మరియు మాజీ సర్పంచ్ అంబర్ సింగ్ పరమేష్, విజయ్. భాస్కర్, హరిలాల్, పాండు, కుమార్, లాలు, భీమ, పంతు తదితరులు ఉన్నారు.

## ఎగిరేది గులాబీ జెండానే..

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 03 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండా యేనని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్మెన్ రజిత సాయిచంద్, పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ లు అందజేశారు.

**బీఆర్ఎస్ అభ్యర్థులు వీరే..**

1వ వార్డు జాటవత్ కవిత పంతు, రెండో వార్డు కాలే యశోద వీరయ్య, మూడో వార్డు నేనావత్ అంజలి రమేష్, నాలుగో వార్డు దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఐదో వార్డు పాపిశెట్టి రామకృష్ణ, ఆరో వార్డు నేనావత్ పత్య నాయక్, ఏడో వార్డు సభవాత్ కిషోర్, ఎనిమిదో వార్డు రమేష్, 9వ వార్డు సయ్యద్ ఖలీల్, పదో వార్డు మంచుకొండ పద్మ జగదీశ్, 11వ వార్డు జటావత్ ఆచాలి భీంజీ నాయక్, 12వ వార్డు నాగిళ్ళ జంగయ్య, 13వ వార్డు పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, 14వ వార్డు వస్పుల సాయిలు, 15వ వార్డు ఎంగలి భాగ్యమ్మ రఘు పేర్లను ప్రకటించారు.

# మార్కెట్ ఒడుదొడుకులు..

**మదుపర్లకు రాధికాగుప్తా సూచనలు**



అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాలు దేశీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి ఇక ఇటీవల బడ్జెట్ రోజున అనూహ్యంగా సూచీలు పడిపోయాయి. ట్రంప్ ట్రేడ్‌డీల్ ప్రకటనతో అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా మదుపర్లకు సూచనలు చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''గత నెలరోజులుగా ఈక్విటీలు, డెట్, కమోడిటీల్లో ఊగిసలాటలు.. మన సహనానికి, సంక్షిష్ట సమయంలో ప్రశాంతంగా ఉండగల సామర్థ్యానికి పరీక్ష పెడుతున్నాయి. ఏదో కోల్పోతామన్న భావనను పక్కనపెట్టి (FOMO), సానుకూల, ప్రతికూల వార్తలపై కొంచెం తక్కువ దృష్టిపెట్టి, వారి పెట్టుబడులకు కట్టుబడి ఉండేవారు బాగా రాణిస్తారు. ఇలాంటి సమయంలో మన ఊహ కంటే స్పందించడమే ఎక్కువ నష్టం చేస్తుంది'' అని ఆమె రాసుకొచ్చారు. ఇలాంటి అస్థిరతల వేళ ఏమీ చేయకుండా ఉండటమే మేలని ఆమె సూచించారు.
కాగా.. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం స్టాక్ మార్కెట్లు పనిచేసిన సంగతి తెలిసిందే. అయితే వార్షిక పద్దులో బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడంతో పాటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను (STT) పెంచడం మార్కెట్లను కుదిపేసింది. తర్వాత సోమవారం కనిష్ఠాల వద్ద మద్దతు లభించడంతో కాస్త కోలుకున్నాయి. భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిందంటూ ట్రంప్ ప్రకటించడంతో నేడు బుల్ పరుగులు పెట్టిన సంగతి తెలిసిందే.

# తొలి యమహా ఈవీ స్కూటర్..



ప్రముఖ ద్విచక్ర వాహనాల సంస్థ యమహా మోటార్ ఇండియా తన తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ఈసీ06ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ. 1,67,600(ఎక్స్ షోరూం)గా కంపెనీ ప్రకటించింది. విద్యుత్ మొబిలిటీ సెగ్మెంట్ రంగంలో అడుగు పెట్టాలనే ఉద్దేశంతో ఈసీ06ను లాంచ్ చేసింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 169 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. ఎంపిక చేసిన నగరాల్లో యమహా బ్లూ స్క్వేర్ ప్రీమియం షోరూంలలో ఈ స్కూటర్లను విక్రయించనున్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తాము కట్టుబడి ఉన్నామని, ఇందులో భాగంగా ఈసీ 06ని లాంచ్ చేసినట్లు యమహా మోటార్ ఇండియా ఛైర్మన్ హాజీమే అయోటా పేర్కొన్నారు.

# అల్గారిథమ్ రీసెట్ చేయండిలా..




ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఫీచర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చిన్న పిల్లలు మొదలుకొని పెద్దవారి వరకు అందరూ ఆసక్తిగా చూస్తుంటారు. ఒక్కోసారి రీల్స్ చూస్తూ కూర్చుంటే గంటలు కూడా గడిచిపోతుంటాయి. రీల్స్ చూసే వారిలో చాలా మందికి ఓ సమస్య ఎదురవుతుంటుంది. ఇంట్లో ఉండే చిన్నపిల్లలు గానీ, పెద్దవాళ్లు గానీ మన ఫోన్ వాడితే మనం రీల్స్ చూసేటప్పుడు మనకు నచ్చిన కంటెంట్ కాకుండా వేరే కంటెంట్ రీల్స్‌లో దర్శనమిస్తుంటుంది. అలా కాకుండా మీకు నచ్చిన కంటెంట్ మాత్రమే చూపించేందుకు ఒక మార్గం ఉంది.. అదే అల్గారిథమ్ రీసెట్. ఇంతకీ ఏంటిది? ఎలా చేయాలి?
మనం ఇన్‌స్టాలో చూసే కంటెంట్ ఆధారంగా అల్గారిథమ్ మనకు కంటెంట్‌ను చూపిస్తుంటుంది. మన ఆసక్తులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు అనుగుణంగానే ఫీడ్ దర్శనమిస్తుంటుంది. సినిమా, స్పోర్ట్స్, ఆధ్యాత్మికం ఇలా.. వ్యక్తుల ఇష్టాయిష్టాలను బట్టి రీల్స్ వస్తుంటాయి. సింపుల్‌గా చెప్పాలంటే మీ ఇష్టాలను నోట్ చేసుకుని మీకు నచ్చినట్లుగా ఇన్‌స్టా వ్యవహరిస్తుంటుంది. దీన్ని కావాలంటే రీసెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఫీడ్‌లో కంటెంట్ చూపించే విషయంలో మార్పులు వస్తాయి.

## ట్రంప్ ట్రేడ్ డీల్.. పాక్, చైనాల కంటే భారత్‌దే పైచేయి



అమెరికాభారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదిరింది దాంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాసియాలోని పొరుగు దేశాలు, కీలక ఎగుమతి పోటీదారుల కంటే మన దేశమే పైచేయి సాధించినట్లయింది. బంగ్లాదేశ్, శ్రీలంకపై టారిఫ్‌లు 20 శాతం కాగా.. పాకిస్థాన్‌పై 19 శాతం, చైనాపై అధికంగా 3437 శాతం వరకు సుంకాలు ఉన్నాయి. ఇండోనేసియా, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా, మలేసియా వంటి ఇతర ఆసియా దేశాల కంటే ఈ టారిఫ్‌లు (18 శాతం) తక్కువే అయినప్పటికీ.. ఐరోపా యూనియన్, జపాన్, దక్షిణ కొరియాతో పోలిస్తే మాత్రం కొంచెం ఎక్కువే. ఈ మూడింటిపై ప్రస్తుతం 15 శాతం సుంకాలు అమలవుతున్నాయి. ఇక బ్రెజిల్ (50 శాతం), మయన్మార్, లావోస్ (40శాతం), దక్షిణాఫ్రికా (30శాతం)పై సుంకాలు ఎక్కువగానే ఉన్నాయి. ట్రేడ్ డీల్‌పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పిన ట్రంప్.. తగ్గించిన సుంకాలు ఎప్పటినుంచి అమల్లోకి వస్తాయో మాత్రం వెల్లడించలేదు. రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌కు ఉన్న గడువు, భారతదేశం ఏ యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ ఒప్పందం నిబంధనలు, అది ఎప్పుడు అమల్లోకి వస్తుందో కూడా తెలియాల్సి ఉంది.

# బుల్లెట్ పరుగు.. మదుపర్ల సంపద ₹12 లక్షల కోట్లు పైకి

**ముంబయి:** చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం సుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది.



ట్రంప్ ప్రకటన నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది. దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# నెలకు రూ.49 వేలతో ఇంటికి టెస్లా వై



**ఢిల్లీ:** అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ టెస్లా దేశీయంగా తన విక్రయాలు పెంచుకునేందుకు కొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. ఎక్స్ఛేంజీ ఆఫర్‌తో పాటు, ఈఎంఐ సదుపాయాన్ని ప్రకటించింది. గతేడాది భారత్‌లో లాంచ్ చేసిన మోడల్ వైకి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో ఈ ఆఫర్లకు తెరతీసింది. పెట్రోల్, డీజిల్ కార్ల వినియోగదారులు ఎలక్ట్రిక్ కారుకు మారాలనుకుంటే ఎక్స్ఛేంజ్‌పై రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకాలను టెస్లా ఆఫర్ చేస్తోంది. లేదంటే రూ.6 లక్షల డౌన్‌పేమెంట్‌తో నెలకు రూ.49 వేలు ఈఎంఐ చెల్లించడం ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ కారును సొంతం చేసుకోవచ్చని టెస్లా పేర్కొంది. సాధారణ కార్లతో ఈవీని సొంతం చేసుకోవడం ద్వారా ఫ్యూయల్, నిర్వహణ ఖర్చుల రూపేణా నెలకు రూ.20వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. అప్పుడు వాస్తవంగా చెల్లించేది రూ.29 వేలేనని తెలిపింది. టెస్లా మోడల్ వై కారు దేశీయంగా రూ.60 లక్షల ధరకు విడుదలైన సంగతి తెలిసిందే. తొలినాళ్లలో ఈ కారు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబరిచారు.
బుకింగ్‌ల వద్దకు వచ్చేసరికి ఆ సంఖ్య వందలకు చేరింది. అందులో రిజిస్ట్రేషన్ చేసుకునేవరకు వెళ్లింది మాత్రం కొందరే. ఫాడా డేటా ప్రకారం.. గతేడాది టెస్లా 225 కార్లను విక్రయించింది. దేశంలో మొత్తం ఈవీ కార్ల విక్రయాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువ. 2024లో దేశంలో 99,875 ఈవీ కార్లు అమ్ముడుకాగా.. 2025లో 77 శాతం వృద్ధితో 1,76,817 యూనిట్లను వివిధ కంపెనీలు విక్రయించాయి. అధిక ధర వల్ల మోడల్ వై లగ్జరీ సెగ్మెంట్‌లోకి వెళ్లిపోయింది. ఆ ధరలో బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి కార్లు మెరుగైన ఫీచర్లతో లభిస్తుండటం.. మోడల్ వై కస్టమర్లను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో ఆఫర్లను ప్రకటించడం గమనార్హం.

## రైతుల ప్రయోజనాలపై రాజీలేదు

భారత్‌తో ట్రేడ్‌డీల్‌పై అంగీకారానికి వచ్చామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందంటూ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టతనిచ్చాయి. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ తొలినుంచి అంగీకరించడం లేదు. ఇప్పుడు కూడా అదే విషయాన్ని పునరుద్ఘాటించాయి. అలాగే వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని పేర్కొన్నాయి. అమెరికా (USA) తన రైతులకు భారీగా రాయితీలు ఇస్తుంటుంది. దాంతో వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెటింగ్ ధరల కంటే తక్కువకు అమ్మగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పండించడానికి అయిన వ్యయంకంటే కూడా తక్కువకే ఎగుమతి చేస్తారు. వాటిపై భారత్ సుంకాలు తగ్గిస్తే.. మన రైతులపై తీవ్రప్రభావం పడుతుంది. ఇంతకాలం ట్రేడ్‌డీల్ చర్చల్లో ప్రతిష్టంభనకు ఇది కూడా ఒక కారణంగా ఉంది. తాజాగా ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించిందా..? అనే ప్రశ్నలు ఎదురు కాగా, ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ''ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు వెనెజువెలా నుంచి మనం చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు వాటిని ఎత్తివేశారు.

# హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్.. ఇటలీ సంస్థతో ఒప్పందం

**ఢిల్లీ:** దేశీయ పారిశ్రామిక దిగ్గజ సంస్థ అదానీ గ్రూప్ హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అడుగుపెట్టింది. ఇటీవలే బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్‌తో కలిసి దేశీయంగా విమానాలను తయారుచేసే వ్యవస్థ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ.. తాజాగా హెలికాప్టర్ల తయారీ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు ఇటలీకి చెందిన లియోనార్డో కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 'మేకిన్ ఇండియా'కు ఊతం ఇవ్వడంతో స్వావలంబనకు తోడ్పడుతుంది. ఈ మేరకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థల ప్రతినిధులు మంగళవారం భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా భారత సైన్యం, వైమానిక దళ అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. లియోనార్డో సంస్థకు చెందిన AW169M, AW109 TrekkerM హెలికాప్టర్లను దేశీయంగా తయారుచేయడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశం. దశలవారీగా స్థానిక తయారీ పెంచడంతో పాటు మెయింటెనెన్స్, నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్ (MRO) సామర్థ్యాలు, పైలట్ల శిక్షణ వంటివి ఇందులో భాగంగా ఉంటాయని అదానీ గ్రూప్ ఓ ప్రకటనలో పేర్కొంది. భారత్‌లో హెలికాప్టర్ వినియోగం చాలా తక్కువగా ఉంది. దేశంలో 250 కంటే తక్కువ హెలికాప్టర్లు మాత్రమే ఉన్నాయి. వచ్చే 10 సంవత్సరాల్లో సంవత్సరానికి సుమారు 100 హెలికాప్టర్ల చొప్పున అవసరం పడతాయనేది అంచనా. సాయుధ దళాల కోసం రాబోయే దశాబ్దంలో వెయ్యికి పైగా హెలికాప్టర్ల అవసరం ఉండొచ్చని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సీఈఓ అశీష్ రాజ్‌వంశీ తెలిపారు.

# మహిళలకు 40 గ్రా. .. పురుషులకు 20 గ్రా.

**అమల్లోకి వచ్చిన బ్యాగేజీ నిబంధనలు-2026**
**విదేశాల నుంచి పసిడి ఆభరణాలు తెచ్చుకునేందుకు గరిష్ఠ పరిమితి ఇది**

**హైదరాబాద్ :**



విదేశాల నుంచి విమానం లేదా సముద్ర మార్గాల్లో మనదేశానికి వచ్చే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళా ప్రయాణికులు 40 గ్రాముల వరకు, పురుషులు 20 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను సుంకం లేకుండా తీసుకురావచ్చని తెలిపింది. అయితే వీరు ఏడాదికి పైగా విదేశాల్లో నివసిస్తూ, తిరిగి వస్తున్న వారు లేదా భారత సంతతి పర్యాటకులైనా కావచ్చు. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ ఆభరణాలు కచ్చితంగా వ్యక్తిగత వినియోగం కోసమే తీసుకురావాలి. బిస్కెట్లు, కడ్డీల రూపంలో ఉండే పసిడికి ఈ మినహాయింపు లభించదు. ఇప్పటివరకు మహిళలు రూ.లక్ష, పురుషులు రూ.50 వేల విలువైన ఆభరణాలే ఇలా తెచ్చుకోవచ్చు.
2016 నాటి పాత నిబంధనల స్థానంలో, రూపొందించిన 'బ్యాగేజీ నిబంధనలు 2026' ఈనెల 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సోమవారం తెలిపింది. ఈ ప్రకారం..
విదేశాల నుంచి తిరిగి వచ్చే భారతీయ నివాసితులు, విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి పర్యాటకులు లేదా పర్యాటక వీసా కాకుండా ఇతర వీసాలపై వచ్చే విదేశీయులు, తమ వెంట తీసుకొచ్చే రూ.75,000 విలువైన వస్తువులపై కస్టమ్స్ సుంకం (డ్యూటీ) మినహాయింపు ఉంటుంది. గతంలో ఈ పరిమితి రూ.50,000 మాత్రమే. ఇకపై వీరు వ్యక్తిగత వినియోగం కోసం రూ.75,000 విలువైన వస్తువులను కస్టమ్స్ సుంకం చెల్లించకుండానే ఇక్కడకు తీసుకురావొచ్చు. రెండేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఈ మినహాయింపు వర్తించదు.
విదేశీయులకు ప్రత్యేక పరిమితి: విమానం లేదా నౌకలపై వచ్చే విదేశీ పర్యాటకులు రూ.25,000 విలువైన కొత్త వస్తువులనే సుంకం లేకుండా తీసుకురాగలరు. భూమార్గం (రోడ్డు లేదా రైలు) ద్వారా వచ్చే ప్రయాణికులకు వారి వ్యక్తిగత అవసరాలకు వాడే పాత వస్తువులపైనే మినహాయింపు ఉంటుంది.
ఎలక్ట్రానిక్ వస్తువులు: 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న ప్రయాణికులు (విమాన సిబ్బంది కాకుండా) అదనంగా ఒక కొత్త ల్యాప్‌టాప్ లేదా నోట్ ప్యాడ్‌ను సుంకం లేకుండా తమ లగేజీలో తీసుకురావచ్చు. ప్రయాణంలో వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకునే పాత వస్తువులపై (దుస్తులు, ఇతర పరికరాలు) ఎలాంటి సుంకం ఉండదు.

### శాశ్వతంగా తిరిగి వస్తుంటే..

ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాల వల్ల విదేశాల్లో ఉండి, ఇప్పుడు శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చే వారికి, నివాస కాలం ఆధారంగా గృహోపకరణాలపై ప్రత్యేక మినహాయింపులు లభిస్తాయి.
విదేశాల్లో 312 నెలలు నివాసం ఉన్న వారికి రూ.1,50,000 విలువైన గృహోపకరణాలు గత రెండేళ్లలో ఏడాదిపాటు విదేశాల్లో ఉన్న వారు రూ.3 లక్షల విలువైన వస్తువులను తీసుకురావొచ్చు. కనీసం రెండేళ్లు విదేశాల్లో ఉండి, తిరిగి వచ్చేవారు గరిష్ఠంగా రూ.7.50 లక్షల విలువైన వస్తువులను సుంకం లేకుండా తెచ్చుకోవచ్చు.
దిగివస్తున్న బంగారం, వెండి ధరలు
బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు కొనసాగుతోంది. ఔన్సు (31.10 గ్రా) బంగారం ధర సోమవారం రాత్రి 11.55 గంటల సమయానికి 263 డాలర్లు తగ్గి 4629 డాలర్ల వద్ద ఉంది. ఒకదశలో బంగారం ధర 4413 డాలర్లకు దిగి వచ్చినా, మళ్లీ కాస్త కోలుకుంది. ఔన్సు వెండి ధర 8 డాలర్లు నష్టపోయి 76 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,50,000, కిలో వెండి ధర రూ.2,48,490 (పన్నులతో కలిపి) వద్ద స్థిరపడింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు ధర రూ.1,41,900, కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2,32,500 వద్ద స్థిరపడింది.

### బదిలీ కుదరదు..

సుంకం మినహాయింపు పరిమితి పూర్తిగా వ్యక్తిగతం. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉంటే, వారికి విడివిడిగానే ఈ పరిమితులు వర్తిస్తాయి. ఒక ప్రయాణికుడికి ఉన్న పరిమితిని మరొకరితో పంచుకునేందుకు, కలపడానికి కుదరదు. 2 లీటర్ల మద్యం, 100 సిగరెట్లు, 125 గ్రాముల పొగాకు ఉత్పత్తుల వరకు సుంకం వర్తించదు. తుపాకులు, ఆభరణాలు కాని బంగారం లేదా వెండి, టీవీ వంటి వస్తువులకు సాధారణ సుంకం మినహాయింపు వర్తించదు. విమాన లేదా నౌకా సిబ్బంది తమ విధుల్లో భాగంగా వస్తుంటే.. వారు రూ.2,500 విలువైన చాక్లెట్లు, సౌందర్య సాధనాలను సుంకం లేకుండా తేగలరు. విదేశీ కరెన్సీని దేశంలోకి తేవడం, బయటకు తీసుకెళ్లడం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ 2015' నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని సీబీఐసీ పేర్కొంది.

# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

**వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు**
**ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్**



ఐసీసీ టీ 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్‌డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్‌ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్‌ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్‌పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ లేకపోతే ప్రకటనల ద్వారా రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 10 సెకన్ల ప్రకటనకు రూ.40 లక్షల వరకు వసూలు చేసే స్థాయిలో ఈ మ్యాచ్‌కు ఆదరణ ఉంది.మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, మహమ్మద్ యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్, మొహ్సిన్ ఖాన్ లాంటి పలువురు మాజీ క్రికెటర్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో, పాకిస్తాన్ తుది నిర్ణయం ఏవిధంగా ఉంటుందన్నది అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# తారాజువ్వలా ఇషాన్ కిషన్



**గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్**
**టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?**
**అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్**

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్థ సెంచరీ బాదాడు. ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది. గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

# సందిగ్ధంలో సంజూ శాంసన్ కెరీర్



టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కెరీర్ ఇప్పుడు ఒక సందిగ్ధంలో పడింది. కివీస్‌తో జరిగిన సిరీస్‌లో ఘోరంగా విఫలమైన సంజూకి, సౌతాఫ్రికాతో జరగబోయే వార్మప్ మ్యాచ్ ఇప్పుడు చావోరేవో లాంటిది. ఈ ఒక్క మ్యాచ్‌లో సంజూ మెరిస్తేనే మెయిన్ టీమ్‌లో చోటు దక్కుతుంది, లేదంటే బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు సంజూ శాంసన్ ఫామ్ భారత క్రికెట్ అభిమానులను తీవ్రంగా కలవరపెడుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో సంజూ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 46 పరుగులు మాత్రమే చేసి, 9.2 సగటుతో తన దయనీయ స్థితిని చాటుకున్నాడు. అదే సమయంలో జట్టులోకి వచ్చిన ఈషాన్ కిషన్ కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో 215 పరుగులు బాదేసి, తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ఇప్పుడు సంజూ గనుక తనను తాను నిరూపించుకోకపోతే ప్లేయింగ్ ఎలెవన్ నుంచి ఉద్వాసన తప్పదు. బుధవారం నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో భారత్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. విచిత్రం ఏమిటంటే.. ఇది కేవలం ప్రాక్టీస్ మ్యాచ్ అయినప్పటికీ దాదాపు 35 వేల టికెట్లు అమ్ముడైపోయాయి. స్టేడియం మొత్తం హౌస్‌ఫుల్ కాబోతోంది. ఇంత భారీ జనం మధ్య సంజూ గనుక మెరుపు ఇన్నింగ్స్ ఆడితే, సెలెక్టర్ల మనసు మళ్లీ మారే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో సంజూకి అవకాశం దక్కుతుందా? దక్కితే దాన్ని వినియోగించుకుంటాడా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రపంచకప్ ఆరంభంలో భారత్ జట్టు యూఎసఏ, నమీబియా వంటి చిన్న జట్లతో తలపడనుంది. ఆ మ్యాచ్‌ల్లో చోటు దక్కాలంటే సౌతాఫ్రికాపై సంజూకి మంచి స్కోరు అవసరం. ఈషాన్ కిషన్ ఫుల్ ఫామ్‌లో ఉండటం వల్ల ఓపెనింగ్‌లో రోహిత్, విరాట్ స్థానాల తర్వాత కిషన్ పేరు వినిపిస్తోంది. సంజూ గనుక మిడిల్ ఆర్డర్‌లో సత్తా చాటకపోతే, టీమ్ కాంబినేషన్ నుంచి అతడిని పక్కన పెట్టడం ఖాయం. ఒకరకంగా చెప్పాలంటే సంజూ శాంసన్‌కు ఇది ఫైనల్ లాంటి పరీక్ష. సంజూ శాంసన్ టాలెంట్ పై ఎవరికీ అనుమానం లేదు, కానీ నిలకడలేమి అతడిని ఎప్పుడూ ఇబ్బంది పెడుతోంది. గత రెండేళ్లుగా ఐపీఎల్‌లో బాగా ఆడుతున్నప్పటికీ, బ్లూ జెర్సీలో సంజూ ఇంకా తన ముద్ర వేయలేకపోయాడు. మరోవైపు యువ ఆటగాళ్ల పోటీ పెరిగిపోవడంతో సంజూకి ఈ సౌతాఫ్రికా మ్యాచ్ మలుపుగా మారాలి. ఇక్కడ రన్స్ వస్తే సంజూ హీరో, లేదంటే ప్రపంచకప్ ఆశలు గాలిలో దీపంలా మారుతాయి.

## భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

**పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారు**
**భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి**

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు.

# డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

**సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి**




మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్?కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్?కే ఫ్రాంచైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంచైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంచైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, దిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.

# ఆలస్యంగా శ్రీలంక స్క్వాడ్ ప్రకటన..

**ధనుంజయ డిసిల్వాకు ఉద్వాసన**
**కమిందు మెండిస్‌కు అవకాశం**



ఐసీసీ టీ 20 వరల్‌డ్‌కప్ 2026 కోసం శ్రీలంక జట్టు కీలక మార్పులతో సిద్ధమైంది. కమిందు మెండిస్‌కు చోటు దక్కితే, ధనంజయ డిసిల్వాకు మొండి చేయి చూపారు. అనుభవం, నిలకడపై నమ్మకంతో కమిందును తీసుకున్నారు. శనక కెప్టెన్‌గా, నిస్సాంక, కుశాల్ మెండిస్ వంటి బ్యాట్స్‌మెన్‌లతో జట్టు బలంగా కనిపిస్తోంది. యువ ఆటగాడు పవన్ రత్నాయకేపై అంచనాలున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి టీ 20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది.టీ20 వరల్‌డ్‌కప్ 2026కి ముందు శ్రీలంక జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జట్ల కంటే ఆలస్యంగా స్క్వాడ్‌ను ప్రకటించిన శ్రీలంక.. జట్టులోకి కమిందు మెండిస్‌ను మళ్లీ తీసుకుంటూ, కీలక ఆటగాడు ధనంజయ డిసిల్వాను తప్పించింది. ఈ నిర్ణయం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది.ఇటీవల కాలంలో టీ20 ఫార్మాట్‌లో కమిందు మెండిస్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా సెలెక్టర్లు అతని అనుభవం, మధ్యవరుసలో నిలకడగా ఆడే సామర్థ్యంపై నమ్మకం పెట్టుకున్నారు. ఇప్పటివరకు 35 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 540 పరుగులు చేసిన కమిందు, ఈసారి వరల్‌డ్‌కప్‌లో కీలక పాత్ర పోషిస్తాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది.మరోవైపు ధనంజయ డిసిల్వా ఇటీవల సిరీస్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఈ ఏడాది మూడు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 43 పరుగులు మాత్రమే చేయడంతో పాటు ఒకే ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టాడు. ఈ కారణంతోనే సెలెక్టర్లు అతన్ని జట్టులోకి తీసుకోకుండా, మరింత స్థిరమైన ఆటగాళ్లపై దృష్టి పెట్టారు.ఈ టోర్నమెంట్‌లో శ్రీలంక జట్టుకు దాసున్ శనక కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. అతని ఆల్‌రౌండర్ ప్రదర్శన, నాయకత్వం జట్టుకు కీలకంగా మారనుంది. బ్యాటింగ్ విభాగంలో పాతుమ్ నిస్సాంక, కుశాల్ మెండిస్, చరిత అసలంక, కుశాల్ పెరెరా వంటి అనుభవజ్ఞులు ఉండటంతో జట్టు బలంగా కనిపిస్తోంది.యువ ఆటగాడు పవన్ రత్నాయకే కూడా ఈసారి జట్టులో చోటు సంపాదించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో అతను చేసిన శతకం, టీ20లో వేగంగా చేసిన పరుగులు సెలెక్టర్లను ఆకట్టుకున్నాయి. భవిష్యత్తు స్టార్‌గా అతనిపై అంచనాలు పెరిగాయి. బౌలింగ్ విభాగంలో వనిందు హసరంగ, మహీష్ తీక్షణ స్పిన్ దళానికి నాయకత్వం వహిస్తుండగా, పేస్ విభాగంలో దుష్మంత చమీర, మతీష పథిరాన కీలక పాత్ర పోషించనున్నారు. అయితే ప్రమోద్ మదుషన్, నువాన్ తుషారా, బినుర ఫెర్నాండోలకు ఈసారి జట్టులో అవకాశం దక్కలేదు.గ్రూప్ బీలో ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఒమాన్, జింబాబ్వే జట్లతో కలిసి శ్రీలంక పోటీ పడనుంది. కొలంబో, పల్లెకెలే వేదికలపై మ్యాచ్‌లు జరగనున్నాయి. సహ ఆతిథ్య దేశంగా బరిలోకి దిగుతున్న శ్రీలంక, హోం గ్రౌండ్ అడ్వాంటేజ్‌ను ఉపయోగించుకొని మరోసారి ట్రోఫీ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2014లో భారత్‌పై గెలిచి టైటిల్ గెలిచిన జ్ఞాపకాలను అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు.


**శ్రీలంక జట్టు**

దాసున్ శనక (కెప్టెన్), పాతుమ్ నిస్సాంక, కమిల్ మిశారా, కుశాల్ మెండిస్, కుశాల్ పెరెరా, చరిత అసలంక, కమిందు మెండిస్, జనిత్ లియానగే, పవన్ రత్నాయకే, దునిత్ వెల్లాలగే, వనిందు హసరంగ, మహీష్ తీక్షణ, దుష్మంత చమీర, మతీష పథిరాన, ఇషాన్ మలింగా.

## అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుందా?

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ఘటనకు వేదికగా నిలవనుంది. ఇప్పటి వరకు ఒకే ఆటగాడు రెండు దేశాల తరపున క్రికెట్ ఆడిన ఘటనలు చూశాం. కానీ రెండు దేశాల తరపున వేర్వేరు క్రీడల్లో వరల్డ్ కప్‌లో పాల్గొన్న అరుదైన ఘట్టం తొలిసారి చోటు చేసుకోనుంది.2006లో సౌతాఫ్రికా తరపున హాకీ వరల్డ్ కప్ ఆడిన వేన్ మ్యాడ్‌సన్ 20 ఏళ్ల తర్వాత ఇటలీ కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్ 2026లో బరిలో దిగనున్నాడు. తొలిసారి ఇటలీ టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించగా.. అతను ఆ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. అతను గతంలో పీఎసఎల్, బీపీఎల్, హండ్రెడ్ లీగ్‌లోనూ ఆడాడు.

# సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ



అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్ 10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది.

# పాక్ తీరుతో కుప్పకూలనున్న క్రీడా ఆర్థిక వ్యవస్థ!




క్రికెట్ ప్రపంచంలో అత్యంత క్రేజ్ ఉన్న పోరు అంటే అది భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ మాత్రమే. మైదానంలో ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కళ్లు టీవీలకు అతుక్కుపోతాయి. అయితే, 2026 టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన భారత్‌పాక్ లీగ్ మ్యాచ్‌పై నీలి నీడలు కమ్ముకున్నాయి. భద్రతా కారణాలు లేదా రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో క్రికెట్ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా వణికిపోతోంది. క్రీడా విశ్లేషకులు, ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, కేవలం ఈ ఒక్క మ్యాచ్ రద్దు కావడం వల్ల అంతర్జాతీయ క్రికెట్ మార్కెట్ దాదాపు రూ. 4,500 కోట్ల (వి500 మిలియన్ల) మేర నష్టపోనుంది. ఈ భారీ నష్టం కేవలం ఒక విభాగం నుంచే కాకుండా పలు కోణాల్లో ఉండనుంది:

ప్రసార హక్కులు, ప్రకటనలు: దాయాదుల పోరుకు ఉండే వ్యూవర్‌షిప్ దృష్ట్యా ప్రకటనల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ మ్యాచ్‌లో కేవలం 10 సెకన్ల ప్రకటన స్లాట్ ధర రికార్డు స్థాయిలో రూ. 25 లక్షల నుండి రూ. 40 లక్షల వరకు పలుకుతోంది. మ్యాచ్ రద్దయితే కేవలం అడ్వర్టైజ్‌మెంట్ల రూపంలోనే రూ. 300 కోట్ల ఆదాయం గాలిలో కలిసిపోతుంది. ప్రపంచకప్ ప్రధాన స్పాన్సర్లు భారత్‌పాక్ మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకునే భారీగా పెట్టుబడులు పెడతారు. మ్యాచ్ జరగకపోతే ఇన్వెస్టర్ల నమ్మకం దెబ్బతినడంతో పాటు మార్కెట్ విలువ పడిపోతుంది. టికెట్ల అమ్మకాలు, పర్యాటకం: కొలంబోలో జరిగే ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే వేలాది మంది అభిమానులు విమాన టికెట్లు, హోటల్ బుకింగ్‌లు చేసుకున్నారు. మ్యాచ్ రద్దుతో పర్యాటక రంగం కూడా కోట్లాది రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల మ్యాచ్ రద్దయితే బీమా లభిస్తుంది. కానీ, ఒక దేశం లేదా జట్టు కావాలని మ్యాచ్‌ను బహిష్కరిస్తే దానికి ఎటువంటి బీమా వర్తించదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనివల్ల ఐసీసీ తో పాటు ఇరు దేశాల బోర్డులకు భారీ ఆర్థిక భారం తప్పదు. భారత క్రికెట్ బోర్డు ఆర్థికంగా చాలా బలంగా ఉన్నందున ఈ నష్టాన్ని తట్టుకోగలదు. కానీ, ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇది ఆత్మాహుతి నిర్ణయం వంటిదే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐసీసీ నుంచి పాక్ బోర్డుకు ఏటా అందే సుమారు వి34.51 మిలియన్ల ఆదాయంపై కూడా దీని ప్రభావం ఉండవచ్చు. ఒకవేళ పాక్ రాకపోతే భారత్‌కు వాకోవర్ పాయింట్లు లభించి, విజేతగా ప్రకటిస్తారు.



# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్

గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్ధానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ`ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్`వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.




# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

బాహుబలి, ఆరఆరఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృధ్వి రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు` ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆరఆరఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్ట్రిబ్యూషన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.


# దురంధర్2 షూట్‌లో డ్రోన్ వినియోగం



ముంబైలోని హై`సెక్యూరిటీ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ కెమెరాను ఉపయోగించినందుకు గాను బాలీవుడ్ మూవీ 'ధురంధర్ 2' చిత్ర బృందంపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. దక్షిణ ముంబైలోని పోర్ట్ ప్రాంతంలో ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా డ్రోన్‌ను వినియోగించినందుకు చిత్ర లొకేషన్ మేనేజర్ రింకూ రాజ్‌పాల్ వాల్మీకిపై పోలీసులు ఎఫఐఆర్ దాఖలు చేసినట్లు సమాచారం. గత మూడు రోజులుగా ముంబై ఫోర్ట్ ప్రాంతంలో 'ధురంధర్ 2' షూటింగ్ కొనసాగుతుండగా, చిత్ర బృందం ఈ చారిత్రాత్మక ఫోర్ట్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లోని ఒక పాత వీధిని తలపించేలా సెట్ వేసింది. ఫిబ్రవరి 1న జరిగిన షూటింగ్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే నిబంధనలకు విరుద్ధంగా గాలిలోకి డ్రోన్‌ను ఎగురవేయడం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ముంబైలోని పోర్ట్ ప్రాంతం ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలకు కేంద్రం కావడంతో ఇక్కడ భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై కఠినమైన ఆంక్షలు అమలులో ఉన్నాయి. అలాగే డ్రోన్ ఎగురవేయడానికి ముందు తీసుకోవాల్సిన తప్పనిసరి అనుమతులను చిత్ర యూనిట్ తీసుకోలేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు లొకేషన్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఎవరినీ అరెస్టు చేయనప్పటికీ, భద్రతా నిబంధనల ఉల్లంఘనపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు. హై`సెక్యూరిటీ జోన్లలో షూటింగ్ జరుపుకునేటప్పుడు చట్టపరమైన అనుమతులు కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# దరుంధర్`2 టీజర్ విడుదల

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. 'ధురంధర్:ది రివెంజ' పేరుతో మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా.. రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. 'ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది' అని రణ్‌వీర్ సింగ్ రివెంజ్ డైలాగుతో అదరగొట్టారు.




# రెయిన్ మ్యాన్ అంటూ ఆటపట్టించేవారు: మాధవన్


**ఇటీవల 'ధురంధర'లో కనిపించి ఆకట్టుకున్న నటుడు మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు. ఇకపోతే తన గ్యాప్‌పై ఆయన వివరాఉల పంచుకున్నారు. విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ చెప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు.**



**'నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను. కనీసం ప్రకటనల్లో కూడా నటించలేదు. దేశంలో పర్యటించాను. గడ్డం పెంచుకొని చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతిఒక్కరితో మాట్లాడాను. వాళ్ల జీవనశైలి, వారిని ఇబ్బందిపెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ నాలుగేళ్ల పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది' అని మాధవన్ అన్నారు. విరామం తర్వాత చేయాలనుకున్న పాత్రలపై మరింత స్పష్టత వచ్చిందని మాధవన్ అన్నారు. తాను తిరిగి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో కొందరు దర్శక నిర్మాతలకు ముందుచూపు లేదని తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి కొత్త దర్శకులను వెతుకున్నట్లు వెల్లడించారు.**

# పిఆర్‌పై పెద్దగా ఆధారపడను: రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



# నిజాయితీకి నిలువుటద్దం పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ

తులాల బంగారు గొలుసు రోడ్డుపై దొరికితే ఏం చేస్తారు.. ఎవరు మనల్ని చూడటం లేదుగా అని చూసి, ఆ గొలుసును తీసుకొని జేబులో వేసుకుంటామా లేదా. కానీ ఈవిడ మాత్రం అలా చేయలేదు. తనకు దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన తన నిజాయతీని చాటుకుంది ఒక పారిశుద్ధ్య కార్మికురాలు. నిజాయితీకి ఉండే పవర్ ఎలాంటిది అంటే.. ఈ విషయం సూపర్ స్టార్ రజనీకాంత్ దృష్టికి వెళ్లింది. అసలు ఏం జరిగిందంటే..చెన్నై మహానగర పాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ (50) అనే మహిళకు ఇటీవల రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారం దొరికింది. వాస్తవానికి ఆమె తనకు దొరికిన ఆ బంగారంపై ఎలాంటి ఆశపడలేదు. నిజాయితీగా తనకు దొరికిన ఆ 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించింది. ఈ క్రమంలో పలువురు స్థానికులు ఆమెను అభినందించారు. తాజాగా విషయం తెలుసుకొని సూపర్ స్టార్ రజనీకాంత్ తన ఇంటికి పిలిచి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడి, ఆమెను సన్మానించారు. అనంతరం ఆమెకు సూపర్ స్టార్ రజనీకాంత్ ఒక బంగారపు గొలుసును గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే భారత తపాలా శాఖ కూడా పద్మ నిజాయితీకి మెచ్చి అరుదైన గౌరవాన్ని అందించింది. ఇటీవల ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును భారత తపాలా శాఖ రిలీజ్ విడుదల చేసింది. దీంతో



పాటు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా ఇచ్చారు. అలాగే ఆమెను అభినందిస్తూ ప్రభుత్వం తరపున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో అందించారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154